
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

గురువారం 19 డిసెంబరు 2024

జిల్లాల వార్తలు

మొక్కుబడిగా 'ఎల్‌సీడీసీ' సర్వే

- ముగిసిన 'కుష్ఠు' అనుమానితుల గుర్తింపు సర్వే
- 15 లక్షల జనాభాలో లక్ష 70 వేల మందికే సర్వే
- జిల్లాలో 138 మంది గుర్తింపు
- రెండేళ్ల నుంచి ఆశాలకు అందని సర్వే డబ్బులు
- ఈసారి సర్వేపై విముఖత.. అధికారుల ఒత్తిడితో మమ

7

మంజీరా తీరాన మొసలి కలకలం



చండూరు గ్రామ శివారులోని మంజీరా నది ఒడ్డున సేద తీరుతున్న మొసలి

చండూరులో నది ఒడ్డున కనిపించిన మకరం

చిలప్‌చెడ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఆదివారం సంగారెడ్డి జిల్లా అందోలు మండలం అల్మాయిపేటలో మత్స్యకారులకు మొసలి కనిపించగా.. బుధవారం మెదక్ జిల్లాలోని చిలప్‌చెడ్ మండల పరిధి చండూరు గ్రామ శివారులో మొసలి ప్రత్యక్షమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. చండూరు శివారులో మధ్యాహ్నం సమయంలో మంజీరా నది నుంచి వెళ్తున్న రైతులకు ఆవలివైపు ఒడ్డున మొసలి సేదతీరుతూ కనిపించింది. వారు గ్రామస్థులకు తెలియజేయగా ఈ విషయం ఆనోటా ఈ నోటా మండలంలోని ఆయా గ్రామాలకు పాకింది. మంజీరా పరీవాహక ప్రాంత గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చేపలు పట్టేవారు, రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరమున్నది. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ చలో రాజ్‌భవన్ నిరసనలో నిర్మలాజగ్గారెడ్డి



రాజ్‌భవన్ వద్ద నిరసనలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో కలిసి ధర్నా నిర్వహించారు.

ఏడుపాయలను టూరిజం సర్క్యూట్‌లో చేర్చాలి

- చర్చి, జైన మందిరాలతో కలిపి ఏర్పాటు చేయండి
- శాసనమండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరానికి కేవలం వంద కిలో మీటర్ల పరిధిలోనే ఉన్న మెదక్ జిల్లాకు చెందిన ప్రాంతాలను టూరిజం సర్క్యూట్‌లో చేర్చాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి బుధవారం శాసన మండలిలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 9 టూరిజం ప్రాంతాల్లో మెదక్ జిల్లాలోని చారిత్రక ప్రాంతాలు చేర్చకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. నర్సాపూర్‌లో 33 ఎకరాల అర్బన్ పార్కు ఉందని, అక్కడి నుంచి పది కిలోమీటర్ల దూరంలో 1100 సంవత్సరాల నాటి జైన మందిరంతో పాటు ప్రఖ్యాతిగాంచిన ఏడుపాయల దేవస్థానం ఉందన్నారు. అక్కడి నుంచి మరో పది కిలోమీటర్ల దూరంలో కాకతీయ రెండో ప్రతాపరుద్రుడు కట్టించిన ఖిల్లాతో పాటు ఆసియాలోనే అతి పెద్ద చర్చి ఉందని వివరించారు. 450 ఎకరాల్లో పోచారం అభయారణ్యం ఉందని తెలిపారు. వీటన్నింటిని కలిపి టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నర్సింగ్ కాలేజీకి రూ.8 కోట్ల బకాయిలు మంజూరు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి-రాజంపేట రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులు మళ్లీ ఊపందుకున్నాయి. 'పైసల్లేక-పనులు సాగక' అనే శీర్షికన సెప్టెంబరు 17న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తాజాగా రూ.8 కోట్ల నిధులను మంజూరు చేసింది. గతేడాది రూ.34 కోట్లతో నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే, చేసిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో దాదాపు నాలుగు నెలల పాటు కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. ప్రభుత్వం తాజాగా రూ.8 కోట్లు విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి భవనాన్ని అప్పగించే ఆలోచనలో ఉన్నట్టు టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఇంటర్ కళాశాలలకు 'ప్రయోగాల' నిధులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇంటర్మీడియల్ కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షల నిమిత్తం ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఫిబ్రవరిలో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా పరికరాలు, రసాయనాల కొనుగోలు కోసం ఒక్కో జూనియర్ కళాశాలకు రూ.25 వేల చొప్పున సంగారెడ్డి జిల్లాలోని 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.4,75,000 నిధులను కేటాయించారు. ఈ నిధులతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో సీసీ కెమెరాల కొనుగోలుకు రూ.6 వేల చొప్పున నిధులు కేటాయించింది. ఆయా నిధులను కళాశాలల ఖాతాలో ఇంటర్ బోర్డు అధికారులు జమ చేశారు.

మూడు రోజులుగా నీళ్లు బంద్

మిషన్ భగీరథ కార్మికుల సమ్మెతో నిలిచిన సరఫరా



మునిపల్లి మండలం హైద్లాపూర్‌లో వీధిబోరు నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళలు

- వేతనాలు చెల్లించపోవడంతో కాంట్రాక్టు కార్మికుల నిరసన
- సంగారెడ్డి సెగ్మెంట్ పరిధిలోని మూడు నియోజకవర్గాలకు కటకట
- బోర్ల వద్దకు జనం.. పలుచోట్ల ట్యాంకర్లతో సరఫరా

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మిషన్ భగీరథ సెగ్మెంట్ పరిధిలోని మూడు నియోజకవర్గాలకు మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. జహీరాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్ అయ్యాయి. దీంతో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ కార్మికుల సమ్మెతో తలెత్తిన ఇబ్బంది ఇది. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించపోవడంతో మూడు రోజులుగా కార్మికులు నిరసన బాట పట్టారు.



సదాశివపేటలోని సిద్దాపూర్ కాలనీలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

వేతనాలివ్వని సబ్ కాంట్రాక్టర్

మిషన్ భగీరథ పథకం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గడిచిన పదిహేను నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. ఎన్నో రోజులుగా జీతాల కోసం ఎదురుచూస్తున్న వారు గత్యంతరం లేక సమ్మెబాట పట్టారు. మూడు రోజుల నుంచి విధులను బహిష్కరించారు. సంగారెడ్డి సెగ్మెంట్ పరిధిలో పనిచేస్తున్న 150 మందికి జీకేఆర్ సబ్ కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించాల్సి ఉన్నది. వీరికి వేతనాల కోసం గతంలోనే ప్రభుత్వం రూ.80 లక్షలను విడుదల చేయగా, వాటిని కాంట్రాక్టరు కార్మికులకు ఇవ్వకుండా, దారి మళ్లించారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలిసిన కాంట్రాక్టు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీటి కటకట

సంగారెడ్డి సెగ్మెంట్ పరిధిలోని జహీరాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాలకు సింగూరు ప్రాజెక్టు అంతర్భాగంగా నిర్మించిన మిషన్ భగీరథ నుంచి నీళ్లు సరఫరా అవుతాయి. ఈ ప్రాజెక్టు పరిధిలోని

మిగతా 8వ పేజీలో

బయటపడుతున్న రైతుబీమా అక్రమాలు

- మొన్న గుట్టకిందిపల్లెలో ఇద్దరు.. నిన్న భూర్గుపల్లిలో ఒకరు
- ఏఈవో ఫిర్యాదుతో వెలుగులోకి మరోఘటన

హవేళీఘణపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతు బీమాలో జరుగుతున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మెదక్ మండలంలోని గుట్టకిందిపల్లెలో ఇద్దరు రైతులు బతికుండగానే చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్లను తీసుకుని వారి భార్యలు రైతుబీమ సొమ్ము మింగేసిన ఉదంతం మొన్న వెలుగుచూడగా.. తాజాగా హవేళీఘణపూర్ మండల పరిధిలోని భూర్గుపల్లిలో ఇలాంటి చావు తెలివి ఘటన ఒకటి బయటపడింది. వివరాల్లోకి వెళితే.. భూర్గుపల్లి గ్రామానికి చెందిన లెంక మల్లేశం బతుకుదెరువు కోసం వేరే ప్రాంతానికి 2021 సంవత్సరం కంటే ముందు వలసవెళ్లాడు. కొన్నాళ్ల పాటు గ్రామానికి రాలేదు. ఎలాగు మల్లేశం గ్రామంలో ఉండటంలేదని అందరికి తెలిసిందే కాబట్టి, చనిపోయాడని రైతుబీమా డబ్బు పొందేందుకు పన్నాగం పన్నింది. మల్లేశం 15 జనవరి 2021లో మృతిచెందినట్లు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసి, 2021 ఏప్రిల్‌లో డెత్ సర్టిఫికెట్‌ను పొందింది. మల్లేశం భార్య లెంక పద్మ వ్యవసాయ శాఖాధికారులకు ఈ డెత్ సర్టిఫికెట్‌ను అందజేసిన రైతుబీమా డబ్బు ఇవ్వాలని దరఖాస్తు చేసింది. ఎలాంటి విచారణ చేయని అధికారులు బీమా డబ్బు మంజూరి చేసి పద్మ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. కొన్నాళ్లకు చనిపోయిన వ్యక్తి గ్రామంలో తిరగడంతో వ్యవసాయాధికారిణి స్వాతి పోలీసులకు ఫిర్యాదుతో విషయం బయటకు వచ్చింది. ఈ ఉదంతంపై ఏఈవో స్వాతి ఫిర్యాదు చేయగా ఎస్ఐ సత్యనారాయణ నిందితురాలు పద్మ ఇంటి వద్ద బుధవారం విచారణ చేసేందుకు వెళ్లగా నిందుతురాలి తల్లిమాత్రమే ఉంది.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వ్యవసాయాధికారిణి స్వాతి

ధ్యానం చేద్దాం.. ఒత్తిడిని తరిమేద్దాం

- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా క్లాసులు
- మెదక్ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో మూడురోజుల కార్యక్రమం



కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న శిక్షకుడు

నర్సాపూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతూ మానసికంగా ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారు. వారిని ఒత్తిడి నుంచి దూరం చేయాలనే ఆలోచనతో ఇంటర్ బోర్డు చొరవ తీసుకుని, హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్ర సహకారంతో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ఉచితంగా ధ్యాన్యంపై తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రశాంతంగా ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యనభ్యసించేలా తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ మాస్టర్లు పాల శ్రీనివాస్, కె.అశోక్, ప్రసాద్, బాలుమతి, చిరంజీవి మెదక్ జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి, మూడురోజుల పాటు రోజు 45 నిమిషాల సమయం ధ్యానంపై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో విద్యార్థులతో పాటు లెక్చరర్లు, ఇతరసిబ్బంది కూడా పాల్గొంటున్నారు. మొదటి రోజు కరేజీ, కాన్ఫిడెన్స్, రిలాక్సేషన్, మెడిటేషన్ అంశాలపై శిక్షణ ఇస్తుండగా, రెండో రోజు టైం మేనేజ్‌మెంటు, రిజెనువేషన్, మెడిటేషన్, మూడో రోజు డిసిషన్ మేకింగ్ స్కిల్స్, కనెక్ట్ విత్ ఇన్నర్‌సెల్ఫ్, మెడిటేషన్ అంశాలపై వివరిస్తున్నారు. ఇప్పటికే నర్సాపూర్ నియోజకవర్గంలో నర్సాపూర్, కౌడిపల్లి జూనియర్ కళాశాలలో ఈ శిక్షణ మొదలైంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలలో నిర్దేశించిన తేదీల్లో ధ్యానంపై శిక్షణ ఇస్తామని హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

బ్యాట్ పడితే.. బౌండరీలే



నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న గగ్నీక్షా

- క్రికెట్‌లో దూసుకుపోతున్న గగ్నీక్షా
- వయస్సు ఎనిమిదేళ్లు.. మ్యాచ్‌లు 46
- ప్రముఖ క్రికెటర్లతో ప్రశంసలు

7

బాబోయ్ చలి

- వారం రోజులుగా మరింత పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కోహీర్‌లలో 6.6 డిగ్రీలు

జహీరాబాద్/కోహీర్ డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా గజగజ వణికిపోతున్నది. రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోగా మరోసారి కోహీర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఐదు రోజులుగా కోహీర్‌లో ఏడు డిగ్రీలలోపే ఉష్ణోగ్రత ఉంటుంది. మంగళవారం 6.7 డిగ్రీలుండగా, బుధవారం 6.6 డిగ్రీలు నమోదైంది. దీంతో పాటు జిల్లాలో పలుచోట్ల పది డిగ్రీలలోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్గోల్‌లో 7.6, కంగ్టిలో 8.2, మల్‌చెల్మలో 8.5, న్యాల్‌కల్‌లో 8.5, సత్వార్‌లో 8.6, మొగుడంపల్లిలో 9.2, జిజాంపేటలో 9.2, కడ్పల్‌లో 9.3, కంకోల్‌లో 9.3, అల్మాయిపేటలో 9.4, జహీరాబాద్‌లో 9.5, ముక్తాపూర్‌లో 9.6, లక్ష్మీనగర్‌లో 9.7, దిగ్వాల్‌లో 9.7, నల్లంపల్లిలో 9.8 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.







ప్రకృతి వి'చిత్రం'.. నారింజ పరీవాహకం

వివిధ పట్టణాలలో గ్రామాల్లో పలు రకాల నిర్మాణాలు, మార్పులు, చేర్పులు జరగడం సాధారణంగా చూస్తూనే ఉంటాము. కానీ కాలాల మార్పులతో ఎండలు, వర్షాలు, చలి కాలాలలో వచ్చే ప్రకృతి మార్పులు చూస్తున్నప్పుడు ఎంతో చిత్రంగా కనిపిస్తాయి అలాంటి దృశ్యాలే కోహీర్ మండలంలోని నారింజ పరీవాహక ప్రాంతంలో ఎండాకాలంలో బీడబారి, వర్షాకాలంలో చెరువును తలపించేలా, ప్రస్తుత శీతాకాలంలో పచ్చని పంటతో ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి.

- కోహీర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి)

సొమ్ములు లేకున్నా.. సోకులు..!

- ఖజానాలో రూ. లక్షా 18 వేలే
- మీటింగ్ హాల్ సుందరీకరణకు రూ. 40 లక్షలు
- పదేళ్ల క్రితమే రూ. 20 లక్షలతో రెనోవేషన్
- ఇప్పటికే స్టడీ టూర్ పేరిట రూ. లక్షలు వృథా
- ఇదీ.. సదాశివపేట మున్సిపాలిటీ పాలకవర్గం తీరు



సదాశివపేట, డిసెంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఖజానాలో ఉన్నవి రూ. లక్షా 18 వేలు. కానీ, మీటింగ్ హాల్ రినోవేషన్‌కు అధికారులు పెడుతున్న ఖర్చు రూ. 40 లక్షలు. అన్ని నిధులు ఎక్కడి నుంచి తెస్తారు. మరి కొద్ది రోజుల్లో పదవీ కాలం పూర్తవుతున్న పాలక వర్గం ఇంత ఖర్చుతో సమావేశ హాల్ ఇన్నోవేషన్ కోసం అన్ని నిధులు ఎందుకు ఖర్చు చేస్తోంది అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌ను రూ. 40 లక్షలతో సుందరీకరించేందుకు 2022లో అప్పటి పాలకవర్గం (తీర్మానం నంబర్: 382) ఆమోదముద్ర వేసింది. అయితే, అప్పట్లో పలుమార్లు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఆ పనులు చేపట్టలేదు. అనంతర పరిణామాల్లో చైర్మన్ మారడం.. మరి కొన్ని రోజుల్లో ప్రస్తుత పాలక వర్గ పదవీ కాలం పూర్తి కానున్న నేపథ్యంలో పాత ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చారు. పాత తీర్మానం ప్రకారం టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంతో పనులూ ప్రారంభించారు. వాస్తవానికి ఈ మీటింగ్ హాల్‌ను 2014లోనే సుందరీకరించారు. రూ. 20 లక్షల వ్యకంతంతో ఏసీలు, ఫర్నీచర్, ఫాల్ సీలింగ్, సౌండ్ సిస్టమ్ వంటి పనులు చేపట్టారు.

తాజాగా మళ్లీ సాధారణ నిధుల నుంచి రూ. 40 లక్షలు వెచ్చించడం.. అదీ పదవీ కాలం పూర్తి కావొస్తున్న తరుణంలో పనులు చేపట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గి బాధ్యతలు తీసుకున్న చైర్‌పర్సన్ తన పదవీ కాలంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. అయితే, కొత్త చైర్‌పర్సన్‌కు మద్దతుగా నిలిచిన కౌన్సిలర్లను సంతృప్తిపరచడమే ధ్యేయంగా మున్సిపల్ నిధులు ఖర్చు చేస్తున్నారని అంటున్నారు. నాలుగు నెలల క్రితమే రూ. 15 లక్షలతో కౌన్సిలర్లు చండీగఢ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడమే వృథా ఖర్చు అని భావిస్తున్న నేపథ్యంలో మీటింగ్ హాల్ రెనోవేషన్ వారి జేబులు నింపుకునేందుకే అని ప్రజలు అంటున్నారు.

జనరల్ ఫండ్ రూ.1.18 లక్షలు మాత్రమే

బల్దియా ఖజానాలో ఈ నెల 12 నాటికి జనరల్ ఫండ్ నిల్వ కేవలం రూ. లక్షా 18 వేల 452 మాత్రమే ఉంది. సిబ్బంది జీతాలకు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. ఆదాయం పెంచుకోవంలో పూర్తిగా విఫలమైంది. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో బహుళ అంతస్థుల భవనాలు, భారీ కమర్షియల్ సముదాయాలు, విస్తరించిన పాత, కొత్త పరిశ్రమలు, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్‌ల నుంచి తూతూ మంత్రంగా ఆస్తిపన్ను వసూలు చేయడంతో బల్దియా ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆయా యాజమాన్యాల నుంచి మామూళ్లు అందుకుని వారికి నామమాత్రంగా ఆస్తిపన్ను విధిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బల్దియా ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సరిగ్గా లేని, పదవీ కాలం పూర్తి కావొస్తున్న సమయంలో రూ. 40లక్షలతో మీటింగ్ హాల్ రినోవేషన్ అవసరమా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరాన్ని సుందరీకరిస్తున్న దృశ్యం

గురుకులాల్లో నిరంతర తనిఖీలు

- భోజనంలో లోపం కనిపిస్తే కఠిన చర్యలు
- కొత్త మెనూ పక్కాగా అమలు చేయాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా కేంద్రంలోని గురుకులాల్లో ఆకస్మిక తనిఖీ



బాలికల పాఠశాలలో వంట తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి, గురుకులాల్లో నిరంతరం తనిఖీ నిర్వహిస్తామని, భోజన నాణ్యత విషయంలో ఏదైఆన లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ గురుకుల బాలికల, సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలను ఆయన ఆకస్మింగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార మెనూ, వంట గది, స్టోర్‌రూం, డైనింగ్ హాల్, వసతులు, భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భోజన నాణ్యతపై విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొత్త మెనూ అమలు చేయాలని ఆయా ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఇంటర్ విద్యాబోధనలో సమూల మార్పులు అవసరం

ఇంటర్ విద్యాబోధనలో సమూల మార్పులు అవసరమని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనా మెలుకువలు నేర్పాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వం అన్ని వసతులు మెరుగుపరుస్తుందని, దానికి అనుగుణంగా లక్ష్యాలను సాధించడంలో నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రథమ, ద్వితీయ విద్యార్థులను కళాశాల వారీగా విభజించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఇంటర్ ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ సమావేశంలో ఇంటర్ జిల్లా నోడల్ అధికారి మాధవి, కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వసతి గృహ సంక్షేమ అధికారులు

జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారులు టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశారు. నూతనంగా అమలు చేస్తున్న కొత్త మెనూను ఆహ్వానిస్తూ.. విద్యార్థుల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన మెనూ అమలుకు కావాల్సిన పరికరాలు, సౌకర్యాలను కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ శాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు శేషాచారి, వార్డెన్‌లు పాల్గొన్నారు.

జోగిపేట ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



క్షతగాత్రుడికి శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

జోగిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట ఏరియా ఆసుపత్రిలోని వైద్యులు బుధవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. మూడురోజుల క్రితం కామారెడ్డికి చెందిన కుమ్మరి రాజు(38) బైక్ నడుపుతూ అన్నాసాగర్ వద్ద డివైడర్‌కు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడి ఎడమ మోకాలి వద్ద ఎముక విరిగింది. ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఆనంద్‌నాయక్ తోటి వైద్యులతో కలిసి విరిగిన ఎముకను అతికించే శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశామని పేర్కొన్నారు.

కేవీకేను సందర్శించిన కలెక్టర్



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కౌడిపల్లి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 18: మండల పరిధిలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రానికి(కేవీకే) ఈ నెల 25న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానుండడంతో కలెక్టర్ రాహుల్‌రాజ్ కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ హెలీప్యాడ్‌ల ఏర్పాటులో రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. 25న క్రిస్మస్ పండగా సందర్భంగా జాతీయ రహదారి రద్దీగా ఉండే అవకాశం ఉందని, వారు విమానాశ్రయం నుంచి నేరుగా హెలీకాప్టర్‌లో ఇక్కడికి వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు నిర్వహించే సభ ప్రాంగణములో సరిపడా కుర్చీలు ఉండేలా చూడాలన్నారు. సేంద్రియ ఉత్పత్తులు ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై కేవీకే అధికారులను ఆరా తీశారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ సర్దాసింగ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త సంబాజీ దత్తత్రేయ నస్కర్, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు రవి తహసీల్దార్ అంజనేయులు, ఆర్ఐ శ్రీహరి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండండి

● జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్



విద్యార్థులతో మాట్లాడుతున్న గోవింద్ రామ్

జోగిపేట, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐవో) గోవింద్ రామ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆయన జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇంటర్ పరీక్షలు విద్యార్థుల జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయని, సమయాన్ని వృథా చేయకుండా చదవుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొమ్ము రజిత, అధ్యాపకులు శ్రీనివాసులు, విఠల్, గోవర్ధన్‌రెడ్డి, నూనె శ్రీనివాస్, రాజ్‌కుమార్, మల్లేశం, ప్రసన్న పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు తనిఖీ



ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

కంది, డిసెంబరు 18 : కందిలోని సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ బుధవారం తనిఖీ చేశారు. జైలు మొత్తం కలియతిరుగుతూ పరిశీలించారు. సదుపాయాలను, భోజనం గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలింలించడంతో పాటు ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూశారు. బెయిల్స్, ములాకత్‌లపై ఆరా తీశారు. ఖైదీలు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలకు నిబంధనల ప్రకారం అనవరమైన సదుపాయాలు అందేలా చూడాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.

బైక్ దొంగకు ఏడాది జైలు శిక్ష

గజ్వేల్ రూరల్, డి సెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ దొంగతనం కేసులో నేరస్తుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ గజ్వేల్ కోర్టు అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పు వెల్లడించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల పట్టణం జాంబాగ్ నివాసానికి చెందిన మహ్మద్ అక్తార్ అలియాస్ రషీద్ జనవరి నెలలో గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ సమీపంలో బైక్‌ను తస్కరించాడు. ఈ కేసులో అతడిపై పోలీసులు చార్జీసీట్ ధాఖలు చేయగా విచారణ జరిపిన కోర్టు నేరం చేసినట్లు తేల్చింది. ఈ మేరకు ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది.

బ్యాట్ పడితే బౌండరీలే

క్రికెట్‌లో దూసుకుపోతున్న గగ్నీక్షా

● వయస్సు 8 ఏళ్లు.. మ్యాచ్‌లు 46

● ప్రముఖ క్రికెటర్లతో ప్రశంసలు

క్రికెట్‌లో చిచ్చరపిడుగులా రెచ్చిపోతున్నది సంగారెడ్డికి చెందిన ఎనిమిదేళ్ల గగ్నీక్షా. జానీ, జానీ.. ఎస్ పప్పా అంటూ రైమ్స్ నేర్చుకోవాల్సిన ప్రాయంలో బ్యాట్ పట్టి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. గ్రౌండ్‌లోకి దిగిందంటే సిక్సులు, ఫోర్లతో పరుగుల వరద పారిస్తున్నది.

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ లోని గాయత్రినగర్‌లో నివాసముండే మంజుల, ప్రదీప్ దంపతుల కూతురు గగ్నీక్షా స్టేడియంలో గ్రౌండ్‌లో అడుగుపెట్టిందంటే చాలు తన ఆటకు చప్పట్లు, కేరింతలు మోగాల్సిందే. మల్కాపూర్‌లోని రాహుల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడవ తరగతి చదువుతున్న ఈ చిన్నారి ఐదేళ్ల వయస్సుల్లోనే స్థానికంగా ఉన్న అక్షర క్రికెట్ అకాడమీలో కోచ్‌లు అమర్‌గౌడ్, సల్మాన్‌ల వద్ద శిక్షణ పొందుతోంది. చిన్నారి ప్రతిభను గుర్తించిన కోచ్‌లు ప్రత్యేక శ్రద్ధతో శిక్షణనందిస్తున్నారు. అతి చిన్న వయస్సులోనే వివిధ టోర్నమెంట్లలో 46 క్రికెట్ మ్యాచ్‌లు ఆడింది. 4 ఆఫ్ సెంచరీలు నమోదు చేసింది. తన ఆటతో ప్రముఖ ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, ఇండియన్ మహిళా క్రికెటర్ యశశ్రీల మన్ననలు పొందింది. మరోవైపు చదువులోనూ రాణిస్తూ ఇతర చిన్నారులకు ఆదర్శంగా నిలుస్తోంది గగ్నీక్షా. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎంపికైనా వయస్సు అడ్డు రావడంతో అవకాశం కోల్పోయింది. ఏజ్ ఎలిజిబుల్ అయ్యాక హైదరాబాద్



ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మతో గగ్నీక్షా

లోని రవిశాస్త్రీ క్రికెట్ అకాడమీలో శిక్షణ అందిస్తామని అకాడమీ నిర్వాహకులు తెలుపడం విశేషం.

ఇండియా టీమ్‌లో ఆడడమే లక్ష్యం..

చదువుతోపాటు క్రికెట్ ఆడడంలో నన్ను మా తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహిస్తున్నారు. కోచ్‌లు అమర్‌గౌడ్, సల్మాన్‌లు తనకు ప్రత్యేకంగా ట్రైనింగ్ ఇస్తున్నారు. తాను భవిష్యత్తులో మహిళా ఇండియన్ క్రికెట్ టీమ్‌లో ఆడడమే లక్ష్యం. దానికి ట్రైనింగ్ ఎంత కఠినంగా ఉన్నా కష్టపడతాను. ఇప్పటివరకు ఆడిన టోర్నమెంట్లలో మంచి పరుగులు చేసినందుకు సీనియర్ క్రికెటర్లు అభినందించడం మరువలేను.

– గగ్నీక్షా, చిన్నారి క్రికెటర్, సంగారెడ్డి

తల్లిదండ్రుల ప్రోత్సాహం

ఆడపిల్ల అని ఆటపాటలెందుకని అనుకోలేదు చిన్నారి గగ్నీక్షా తల్లిదండ్రులు. పిల్లలకు ఏ రంగంలో ఆసక్తి ఉంటే అదే రంగంలో వారిని ప్రోత్సహిస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని నమ్మి ప్రోత్సహించారు. క్రికెట్‌లో క్రీడలు, చదువుకు ఆడ, మగ అనే తేడాలు ఉండకూడదని గగ్నీక్షాకు ఆసక్తి ఉన్న రంగం క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణనందించారు. చిన్నారి ఆటను చూసి పలువురు ఇంత పిన్న వయస్సులో ఇంత ప్రతిభ కనబరుస్తుందా అంటూ ఆశ్చర్యానికి లోనవుతున్నారు. భవిష్యత్తులో పెద్ద క్రికెటర్‌గా రాణిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



షీల్డుతో చిన్నారి కుటుంబం

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొన్న బైక్ యువతి మృతి

కొల్చారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కొల్చారం లోతు వాగు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మహమ్మద్‌గౌస్ కథనం ప్రకారం ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన స్వప్న, శ్రీను ద్విచక్రవాహనంపై నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో స్వప్న అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన శ్రీనును చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు..



లోకేశ్వర్‌రెడ్డి (ఫైల్)

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 18 : ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందాడు. బీడీఎల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బానూర్ గ్రామానికి చెందిన లోకేశ్వర్‌రెడ్డి(27) పాశమైలారం ప్యూరో పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం విధి నిర్వహణలో పరిశ్రమ మూడవ అంతస్థులో సోలార్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని పటాన్‌చెరులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బలుపాటి ఆనంద్ (33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్నిరోజుల క్రితం అతడు మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఏడుపాయల ఆలయ సమీపంలోని మంజీరా నది ఒడ్డున చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

● నిందితుడికి రిమాండ్



నిందితుడు సంగమేశ్వర్

పుల్‌కల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన పుల్కల్‌కు చెందిన పెద్దలోడి సంగమేశ్వర్ (41) ఈ నెల 16న రాత్రి 8 గంటలకు పుల్కల్ బస్టాండు వద్ద గందరగోళం సృష్టిస్తుండగా స్థానికులు డయల్ 100 కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సంగమేశ్వర్‌ను సముదాయించారు. అయినా వినకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ అక్కడికి వెళ్లి సంగమేశ్వర్‌కు నచ్చజెప్పె ప్రయత్నం చేశాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్‌ను అతడు దుర్భాషలాడుతూ చేతి రెండు వేళ్లను తాళం చెవి మధ్యలో ఇరికించి దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

మానవ మేథకు కృత్రిమ మేథ సాటిరాదు

● బఫెలో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వేణు గోవిందరాజు



మాట్లాడుతున్న డాక్టర్ వేణు గోవిందరాజు

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 18 : మానవ మేథకు కృత్రిమ మేథ సాటిరాదని అమెరికాలోని బఫెలో విశ్వవిద్యాలయ పరిశోధన, ఆర్థికాభివృద్ధి విశిష్ట ఆచార్యుడు డాక్టర్ వేణు గోవిందరాజు అన్నారు. లక్షల సంవత్సరాల పరిణామ ప్రక్రియల ద్వారా రూపొందించబడిన లక్షణం, సందర్భాన్ని బట్టి క్రియాశీలంగా వ్యవహరించే ప్రత్యేక సామర్థ్యాన్ని మానవులు కలిగి ఉన్నారన్నారు. దీనికి విరుద్ధంగా డేటాసెట్‌లపై కృత్రిమ మేథ ఆధారపడి అనుకరించే సామర్థ్యానికి పరిమితమవుతోందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'కృత్రిమ మేథ వికాసం: మానవ భాషా కమ్యూనికేషన్‌పై దృక్కోణం' అనే అంశంపై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. చెక్‌లిస్టులు, పరీక్షలు, పరిశీలనలతో కృత్రిమ మేథ మనకు సాయపడుతున్నప్పుడు, మానవ ఆలోచన సంక్లిష్టతను ప్రతిబింబించడంలో సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. పది భావోద్వేగ స్థితులైన ఏకాగ్రత, గందరగోళం, ధ్యానం, నిరాశ, బాధ, సందేహం, ఆసక్తి, సాక్షాత్కారం, విశ్వాసం, విసుగు వంటివి అభ్యాస ప్రక్రియలో ఉంటాయన్నారు. సంక్లిష్ట లక్ష్యాలను సాధించడానికి వివిధ ఏజెంట్ల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తూ, తెలివితేటలు ద్రవం వలె ఆయా పరిస్థితులను బట్టి మారుతుంటాయన్నారు. మేధస్సు అనేది సహజంగానే సామాజికమైనది, పరస్పరం ఆధారపడి ఉంటుందని స్పష్టీకరించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి అతిథిని స్వాగతించగా, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు సత్కరించారు. అనంతరం గీతంలోని డైరెక్టర్లు, విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులతో ముఖాముఖి చర్చించారు.

మొక్కుబడిగా 'ఎల్‌సీడీసీ' సర్వే

● ముగిసిన 'కుష్టు' అనుమానితుల గుర్తింపు సర్వే

● 15 లక్షల జనాభాలో లక్ష 70 వేల మందికే సర్వే

● జిల్లాలో 138 మంది గుర్తింపు

● రెండేళ్ల నుంచి ఆశాలకు అందని సర్వే డబ్బులు

● ఈసారి సర్వేపై విముఖత.. అధికారుల ఒత్తిడితో మమ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) సర్వే ఆదివారంతో ముగిసింది. ఈ నెల 2 వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు నిర్వహించిన 'కుష్టు' అనుమానితుల గుర్తింపు సర్వే జిల్లాలో మొక్కుబడిగా సాగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ వైపు చర్మానికి, నరాలకు సోకి ఇబ్బంది పెట్టి ఈ కుష్టు వ్యాధి చాప కింద నీరులా విస్తరిస్తున్నది. ఈ తరుణంగా ఆదిలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. కానీ జిల్లాలో 14 రోజుల పాటు నిర్వహించిన మొక్కుబడి ఎల్‌సీడీసీ సర్వేతో ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఆసక్తి చూపని ఆశాలు..

జిల్లా వ్యాప్తంగా ఎల్‌సీడీసీ పేరిట ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయాలని వైద్య ఆరోగ్య శాఖ గత నెల ఆదేశాలు జారీ చేసింది. చర్మంపై స్పర్శలేని మచ్చలు, ఇతర మచ్చలున్నాయా? అంటూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని సూచించింది. అయితే రెండేళ్ల నుంచి ఆశాలు చేసిన ఎల్‌సీడీసీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. అందుకే ఈ ఏడాది సర్వే చేసేందుకు ఆశా కార్యకర్తలు ఆసక్తి చూపలేదు. ఎల్‌సీడీసీ సర్వే చేయబోమని ముందస్తుగా వైద్యాధికారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కానీ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే మమ అనిపించారనే ఆరోపణలున్నాయి. ఇంటింటికి తిరగకుండానే తిరిగినట్టు సర్వే రిపోర్టు రోజూ అధికారులకు పంపినట్టు తెలిసింది.



సంగారెడ్డిలో ఎల్‌సీడీసీ సర్వేలో ఆశా కార్యకర్తలు, అధికారులు(ఫైల్)

138 మంది గుర్తింపు..

జిల్లా వ్యాప్తంగా 1,70,129 మందిని సర్వే చేయగా, ఇందులో 138 మంది కుష్టు అనుమానితులను గుర్తించారు. జిల్లాలో సుమారు 15 లక్షల జనాభా ఉంటే అందులో కేవలం లక్ష 70 వేల మందినే సర్వే చేయడం మొక్కుబడి సర్వే చేశారనే నిదర్శనానికి అద్దపడుతున్నది. జిల్లాలోని సగానికిపైగా పీహెచ్‌సీ ఏరియాల్లో ఇంటింటి సర్వే చేయలేదని ఓ వైద్యాధికారి తెలిపారు. కొన్ని చోట్ల సర్వే నామమాత్రంగా చేశారనడానికి అధికారులు ఇచ్చిన గణాంకాలే నిదర్శనం. ఇలాంటి తరుణంగా జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలన ఏ మేరకు సాధ్యమవుతుందో వైద్య ఆరోగ్య శాఖ అధికారులకే తెలియాలి. జిల్లాలో జరిగిన మొక్కుబడి సర్వేతో ఉన్నతాధికారులు ఏమేరకు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

నిరసనలో జహీరాబాద్ ఎంపీ



నిరసనలో పాల్గొన్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఆవరణలో బుధవారం చేపట్టిన నిరసనలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. వెంటనే అమిత్‌షా క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ ఎంపీలు నిరసనకు దిగారు.

ఫోక్ సింగర్ ఆత్మహత్య

● 21 రోజుల క్రితం ప్రేమ వివాహం

● ఇన్‌స్టాలో పరిచయంతో పెళ్లి

● హత్య చేశారంటున్న బంధువులు

జగదేవ్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం కాస్త ప్రేమగా మారి 21 రోజుల క్రితం పెళ్లి చేసుకుంది. ఏం జరిగిందో ఏమో కానీ, బుధవారం ఫోక్ సింగర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లిలో బుధవారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్ర బిక్షపతి సత్తమ్మ దంపతుల కుమారుడు దయాకర్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిజామాబాద్ జిల్లా మోసర మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ శృతి(26) జానపద పాటలు పాడి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో దయాకర్‌తో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారి 21 రోజుల క్రితం పీర్లపల్లి గ్రామంలో దయాకర్ కుటుంబ పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వారి ప్రేమ వివాహానికి శృతి తరఫున బంధువులు ఎవరూ రాలేదు. అయితే, బుధవారం గ్రామంలోనే దయాకర్ బంధువుల దశదిన కర్మ ఉండటంతో కుటుంబ సభ్యులంతా వెళ్లారు. శృతి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. దశ దిన కర్మ కార్యక్రమానికి శృతిని తీసుకెళ్లేందుకు భర్త దయాకర్ రాగా, అప్పటికే ఇంట్లో ఉరి వేసుకుని కనిపించింది. కిందికి దించి చూడగా, అప్పటికే చనిపోయి ఉంది. దీంతో శృతి తల్లిదండ్రులకు సమాచారం అందించగా, వారు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు.



శృతి మృతదేహం

కూరగాయల అంటు మొక్కలతో అధిక దిగుబడులు

ములుగు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంటు మొక్కలతోనే అధిక దిగుబడి సాధ్యమవుతుందని ఉద్యాన విశ్వ విద్యాలయం గౌరవ ఉపకలపతి డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. బుధవారం ములుగు మండల కేంద్రంలోని హార్టికల్చర్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అన్ని రకాల కూరగాయలు సంవత్సరం పొడవునా అందుబాటులో ఉండేలా ఉత్పత్తి జరగాలన్నారు. ఆ దిశగా పరిశోధనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. షేక్. ఎన్. మీరా మాట్లాడుతూ కూరగాయల సాగులో అంటుకట్టే విధానంపై శిక్షణ ఇవ్వడం శుభ పరిణామమన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలోని కృషి విజ్ఞాన కేంద్రాల్లో కూరగాయ అంటు మొక్కల ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. అనంతరం అంటు కట్టే పద్ధతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను సన్మానించారు. కేవీకే విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ విజయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తను సన్మానిస్తున్న అధికారులు

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా 2007 బ్యాచ్

● రూ.4 లక్షల ఆర్థికసాయం



మృతుడు వెంకటేశ్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న 2007 బ్యాచ్ సభ్యులు

మెదక్ అర్బన్ /సిద్దిపేట క్రైం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని దౌల్తాబాద్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పూసల వెంకటేశ్ ఈ నెల 18న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి కుటుంబానికి ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన 2007 బ్యాచ్ కానిస్టేబుళ్లు అండగా నిలిచారు. ఈ మేరకు తిరుపతిలోని కల్యాణి పోలీస్ ట్రైనింగ్ డ్యాంతోపాటు 2007 బ్యాచ్ కానిస్టేబుళ్లు కలిసి రూ.4 లక్షల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు నర్సింహులు, సుధాకర్‌రావు, కృష్ణగౌడ్, మహిపాల్, రెడ్యానాయక్, నాగరాజు, యాదగిరి, మహేష్, వెంకటేశ్, రమేష్ కృష్ణ, వినయ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'అధికారులపై దాడులు చేయడం సరికాదు'

చిన్నశంకరంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం సరైనది కాదని టీజీవో అసోసియేట్ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారంరోజుల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్ జాఫర్‌గూడలోని ఓ ప్రైవేట్ కళాశాల చెందిన యాజమాన్యం ఇరిగేషన్ ఏఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, లస్కర్, రెవెన్యూ సిబ్బందిపై 30 మంది బౌన్సర్లతో దాడులు చేయించి, వారి వద్ద సెల్‌ఫోన్లు లాక్కొని విధి నిర్వహణలో చిత్రీకరించిన వీడియోలను డిలీట్ చేసి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యోగ సంఘాలు కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

బడుగుల ఆశాజ్యోతి కేవల్ కిషన్: సత్యనారాయణ

చేగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భూస్వామ్య, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలబడిన వ్యక్తి కేవల్ కిషన్ అని ముదిరాజ్ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ అన్నారు. బుధవారం చేగుంట మండలం పోలంపల్లిలోని ఆయన సమాధి వద్ద కేవల్ వర్ధంతి కమిటీ చైర్మన్ కేవల్ నందకిశోర్ ఆధ్వర్యంలో వర్ధంతి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం మండల సభ్యులు నాగభూషణం, ఎన్నెలి సత్యనారాయణ మాట్లాడారు. 26న పోలంపల్లి గ్రామ శివారులోని ఆయన సమాధి వద్ద జరిగే వర్ధంతిని విజయవంతం చేయాలని కోరారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం: రోజారాణి

జిన్నారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీలో అన్ని కాలనీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బుధవారం వైఎస్ఆర్ కాలనీ 7వ వార్డులో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. పట్టణంలోని అన్ని కాలనీలలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రహదారుల ఏర్పాటు చేపట్టామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మడిదల/జిన్నారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని 133/32 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని గుమ్మడిదల విద్యుత్‌శాఖ ఏడీ దుర్గాప్రసాద్ తెలిపారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీ, గుమ్మడిదల, జిన్నారం, బొంతపల్లి, ప్రకృతి నివాస్, కానుకుంట, గడ్డపోతారం, నల్లవల్లి ఎస్ఎస్-1, ఎస్ఎస్-2 సోలక్‌పల్లి, శివానగర్ సబ్‌స్టేషన్లలో సరఫరా ఉండదని వివరించారు.

'కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి'

నారాయణఖేడ్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మాణిక్ అన్నారు. బుధవారం ఖేడ్ మున్సిపాలిటీ ఆవరణలో మున్సిపల్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సదుపాయాలు కల్పిస్తూ అవసరాల మేరకు కార్మికులను నియమించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని బాబానగర్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం మాట్లాడుతూ సీపీఎం ప్రజా సమస్యలపైనే కాదు సామాజిక సేవలందించడంలోనూ ముందుంటుందన్నారు. శిబిరంలో పలువురికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

28న ఎన్నికలు

మనోహరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలోని వీఎస్‌టీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఈ నెల 28న కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నాయిని నరసింహారెడ్డి సంస్థ తరఫున శ్రీనివాస్‌రెడ్డి పరిశ్రమ నుంచి కార్మికులతో కలిసి లేబర్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ వేశారు. పరిశ్రమలో సుమారు 386 మంది కార్మికులు ఉన్నారు.

జీపీ కార్మికుల రాస్తారోకో

రామాయంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కాంట్రాక్టు కార్మికులు ఆందోళనకు దిగారు. మూడు మాసాలుగా వేతనాలు ఇవ్వటం లేదంటూ బుధవారం రామాయంపేటలో రాస్తారోకో చేపట్టారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోనూ కార్మికులు నిరసనలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా మధ్యాహ్నం అన్ని గ్రామాల కార్మికులు ఇక్కడికి తరలివచ్చి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేశారు. ప్రభుత్వం దిగివచ్చి తమకు వేతనాలు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల ఆందోళనకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలమణి మద్దతు తెలిపారు.



సంగారెడ్డి అర్బన్: ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో డీఈవో వెంకటేశ్వర్లు


మెదక్ అర్బన్: విజేతలకు బహుమతి అందజేస్తున్న డీఈవో రాధాకిషన్

నైపుణ్యాలు పెంపొందించేందుకే టాలెంట్ టెస్టులు

- సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని నైపుణ్యాలను పెంపొందించేందుకే టాలెంట్ టెస్టులు దోహదపడతాయని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ పరీక్షకు 28 మండలాల నుంచి 92 మంది హాజరుకాగా విజేతలకు డీఈవో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఎంఈవో విద్యాసాగర్, సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని మెదక్ డీఈవో రాధాకిషన్ విద్యార్థులకు సూచించారు. బయో సైన్స్ ఫోరం మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తెలుగు మీడియం విభాగంలో ప్రథమ హారిక, ద్వితీయ భానుప్రియ(జెడ్పీహెచ్ఎస్ ఇస్లాంపూర్), ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ నందిని(టీజీఎంఎస్ రేగోడ్), ద్వితీయ సిద్రతస్నీమ్(జీజీహెచ్ఎస్ మెదక్) నిలిచాయి. వీరికి డీఈవో, అధికారులు ధ్రువపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో రాజిరెడ్డి, జిల్ల ఏఎంవో సుదర్శన మూర్తి, టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డిలో కార్డన్ సర్చ్

- అనుమానిత వ్యక్తి అరెస్ట్
- 42 బైకులు, 3 ఆటోలు స్వాధీనం
- నేరాల నియంత్రణకే సర్చ్

సంగారెడ్డి క్రైం/కంగ్టి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని నారాయణరెడ్డికాలనీలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. సంగారెడ్డి డీఎస్పీ కే.సత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో వందమంది పోలీసులతో కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ ప్రోగ్రామ్ చేపట్టారు. కాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక అనుమానిత వ్యక్తితో పాటు 42 బైకులు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వివిధ పరిశ్రమల్లో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం మైగ్రేట్ లేబర్ అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి నివాసముంటున్నారని పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ చుట్టూ జరిగే నేరాల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద, అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలని, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీసుశాఖ ఎస్.నాబ్ నంబరు 8712656777కు లేదా 100 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రమేష్, రూరల్ సీఐ క్రాంతికుమార్, జోగిపేట సీఐ అనిల్, కొండాపూర్ సీఐ వెంకటేశం, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన కంగ్టిలోని క్రాంతి చౌక్ వద్ద బుధవారం ఎస్ఐ విజయ్‌కుమార్, ట్రైనీ ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రావణ్ కుమార్‌రెడ్డితో కలిసి ముమ్మరంగా ద్విచక్ర వాహనాలను తనిఖీ చేపట్టారు. నంబరు ప్లేట్ లేని బైక్‌లను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సంగారెడ్డిలో జోరుగా సీఎం కప్ క్రీడలు

సంగారెడ్డి/గుమ్మడిదల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో సీఎం కప్ క్రీడలు జోరుగా సాగుతున్నాయి. మూడోరోజు బ్యాడ్మింటన్ పోటీలను సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించగా.. స్విమ్మింగ్ పోటీలను డీవైఎస్‌వో ఖాసీంబేగ్, అంబేడ్కర్ స్టేడియంలో వాలీబాల్, అథ్లెటిక్స్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ ప్రారంభించారు. డీవైఎస్‌వో ఖాసీంబేగ్ పర్యవేక్షణలో జరుగుతున్న క్రీడల్లో డీవైఎస్‌వో ఆఫీస్ సూపరింటెండెంట్ జావిద్‌అలీ, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డిలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో గుమ్మడిదల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కానుకుంట విద్యార్థులు ఉమ క్రీడలో రుచిత, రాంచరణ్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, యస్విత, రంజిత్, సీమన్, మల్లికార్జున్, ప్రదీప్‌చారి వివిధ విభాగాల్లో ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకాన్ని గెలుచుకున్నారని ప్రధానోపాధ్యాయురాలు నీరజ తెలిపారు. అలాగే మండలంలోని ఉన్నత పాఠశాలకు చెందిన కొమ్మమ జస్వంత్ జిల్లాస్థాయి బయోలాజికల్ సైన్స్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు.


సంగారెడ్డిలో బ్యాడ్మింటన్ ఆడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

21న పెన్షనర్ల సంఘం భవనం ప్రారంభం

సంగారెడ్డి రూరల్/పెద్దశంకరంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్మించిన పెన్షనర్ల అసోసియేషన్ నూతన భవనాన్ని 21న ప్రారంభించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సంఘం నూతన భవనాన్ని రూ.60 లక్షలతో నిర్మించారని తెలిపారు. ఈ భవనాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిల చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కాగా పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దశంకరంపేటలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని నిర్వహించారు. మండలకార్యవర్గ సభ్యులు పలువురిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం కార్యక్రమాలను మండల అధ్యక్షుడు సాంబయ్యగారి నర్సింహులు సభ్యులకు వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజల భద్రత ప్రధాన లక్ష్యం: ఎస్పీ

మెదక్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని నాలుగు క్యూఆర్టీ పార్టీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇందుకోసం జిల్లాలో నాలుగు క్యూఆర్టీలను కేటాయించామన్నారు.

హాస్మి మసీదు ఆస్తుల పరిరక్షణపై కోర్టు తీర్పు చరిత్రాత్మకం


మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు మోయిద్‌ఖాన్, ముత్తావలి, డాక్టర్ ఎస్ఏ మాజీద్, తదితరులు

నారాయణఖేడ్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని హాస్మి మసీదు ఆస్తులకు సంబంధించి కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని రోడ్లు భవనాలశాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైనార్టీ నాయకులు మోయిద్‌ఖాన్, ముత్తవలి, డాక్టర్ ఎస్ఏ మాజీద్, మీర్ అంజద్‌అలీ, ఖాదర్‌సాబ్, ముంతాజ్, సికిందర్ అలీ, జకిర్యాఖురేషి, అజీం, సాజిద్, మున్వర్ ఖురేషి, తౌసిఫ్ మాట్లాడారు. పట్టణంలోని హాస్మి మసీదుకు 500 ఏళ్ల పూర్వం నుంచి దాదాపు 80 ఎకరాల వరకు భూమి ఉందన్నారు. ఈ మజీద్‌కు ముత్తావల్లిగా డాక్టర్ ఎస్ఏ.మాజీద్ కుటుంబసభ్యులు ఉండేవారన్నారు. దశాబ్దాల క్రితం మసీదుకు సంబంధించిన భూములను మాజీద్ దాయాదులు అనుభవించేవారని తెలిపారు. హాస్మి మసీదు భూములను ముత్తావలి ఎస్ఏ.మాజీద్‌కు స్వాధీనం చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అనంతరం హైకోర్టు ఉత్తర్వుల ప్రతులను మైనార్టీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ రాజుకు అందించారు.

'ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా ఉండాలి'

నర్సాపూర్/చిన్నశంకరంపేట/కంగ్టి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. చిన్నశంకరంపేట మండలం కొరివిపల్లి గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రం పరిశీలించారు. అలాగే కంగ్టి మండలం నాగూర్.కెలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు.

వేస్ట్ డీ కంపోజర్ స్ప్రేతో లాభాలు

కంగ్టి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధరకాల పంటలపై సోకే బ్యాక్టీరియా, ఫంగల్, వంటి వైరల్ తెగుళ్లను అరికట్టేందుకు వేస్ట్ డీ కంపోజర్ స్ప్రే లాభసాటిగా ఉంటుందని ఏడీఏ నూతన్‌కుమార్ అన్నారు. నాగూర్.కెలో రైతు రాజుపాటిల్ పొలంలో వేస్ట్ డీ కంపోజర్ తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన మందులకు బదులు కుళ్లిన వ్యర్థాలతో సుస్థిర వ్యవసాయం చేయొచ్చన్నారు.

డీడీఎస్ ఆధ్వర్యంలో జీవవైవిధ్య పోటీలు

జహీరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు బుధవారం డీడీఎస్ (డెక్కన్ డెవలప్‌మెంట్‌సొసైటీ) ఆధ్వర్యంలో జీవవైవిధ్య క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సిద్ధార్థ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పాతపంటలు, ప్రకృతి, మరిచిపోతున్న పండుగలు, తదితరాలపై పోటీలను నిర్వహించినట్లు డీడీఎస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ లయ, రైతులు పూలమ్మ, నర్సమ్మ పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభను కనబర్చిన వారికి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

'రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలి'

జహీరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు రమేష్, స్నేహలత పేర్కొన్నారు. బుధవారం మొగుడంపల్లి మండలం జాంగారిబోలితండా, మన్నాపూర్, జీడిగడ్డతండా, ఉప్పర్‌పల్లితండా ప్రాంతాల్లో రైతులకు సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగం తదితరాలపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా పంచగవ్య, జీవామృతం, దశపర్ణికషాయం, తదితరాలను తయారుచేసి చూయించారు. ఆయా కార్యక్రమాల్లో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

అపూర్వం.. అద్భుత ఘట్టం


ధ్వజస్తంభాన్ని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి

పుల్‌కల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలోని అతి పురాతనమైన లక్ష్మీ అనంత పద్మనాభస్వామి పునశ్చరణ మహోత్సవాలు బుధవారం ముగిశాయి. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మహారాజుల రామకృష్ణశర్మ వైదిక నిర్వహణలో 16న ప్రారంభమైన మహోత్సవాలు మూడురోజుల పాటు కొనసాగాయి. ఉత్సవాల ముగింపు రోజు వేదపండితులు గర్భ, బీజ, రత్న, ధాతు న్యాసములు, యంత్ర, మూర్తి, ధ్వజ ప్రాణ ప్రతిష్ఠతో పాటు కళాన్యాసములు, పూర్ణాహుతి, మహాభిషేకం, మహదాశీర్వచనం కార్యక్రమాలను నిర్వహించారు. మహోత్సవాల్లో అత్యంత కీలకమైన ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవం కన్నుల పండువలా సాగింది. ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తయారు చేయించిన 42 అడుగుల ధ్వజస్తంభాన్ని ప్రత్యేక వాహనంలో ఆలయం వద్దకు చేర్చారు. ఈ అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అభివృద్ధికి విరాళాలు అందజేసిన దాతలను ఆలయ కమిటీ శాలువాలతో ఘనంగా సత్కరించింది. ఈ మహోత్సవాలకు అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు గాజుల వీరేందర్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కిష్టారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ కాశపాగ ఇమ్మయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివకుమార్, ఎర్రోల్ల పోచయ్య, కాంగ్రెస్ నాయకులు దర్శించుకున్నారు.

- చక్రియాల్‌లో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఉమామహేశ్వర కల్యాణం

చిన్నశంకరంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి ఎక్స్‌రోడ్ వద్ద మహా గణపతి పంచాయత ఆలయం వద్ద ఉమామహేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. హరహర ఎన్‌క్లేవ్ యాజమాన్యం ఆధ్వర్యంలో మహాగణపతి పంచాయత మూడో వార్షికోత్సవాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, అభిషేకం, కుంకుమార్చన చేశారు. మహిళలు స్వామివారికి ఒడి బియ్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం

వెల్దుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బస్వాపూర్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రమణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మూడురోజులుగా నీళ్లు బంద్

5వ పేజీ తరువాయి

మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి గ్రామ శివారులో నిర్మించిన ఇన్‌టెక్ వెల్ నుంచి ప్రతీ రోజు 100 ఎంఎల్‌డీ తాగునీరు పంపింగ్ జరుగుతుంది. కార్మికుల విధుల బహిష్కరణతో మంజీర జలాలు బుస్సారెడ్డిపల్లి తాగునీటి శుద్ధి కేంద్రానికి పంపింగ్ కావడం లేదు. దీంతో ఈ సెగ్మెంట్ పరిధిలోని మూడు నియోజకవర్గాలకు నీటి కటకట తప్పడం లేదు. మూడు రోజులుగా పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని రాఘవపూర్ ఫిల్టర్ బెడ్ వద్ద కూడా పంపింగ్ నిలిచిపోవడంతో దీనిపై ఆధారపడిన పలు గ్రామాల ప్రజలు నీళ్లు రాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజాప్రతినిధులు, నాయకులు ట్యాంకర్లు తెప్పించి నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లు కూడా ఉండడంతో తాగునీటిని కొనుక్కుంటున్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న సింగిల్ ఫేజ్ మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వీధి బోర్ల వద్ద మహిళలు బిందెలతో నీటిని పట్టుకుంటున్నారు. పలుచోట్ల అవికూడా లేకపోవడంతో ఆఖరిలో బోర్లు ఉన్న వారి ఇంటి వద్దకు వెళ్లి నీళ్లివ్వాలని కోరి పట్టుకుంటున్నారు. అయినా నీటి సరఫరా ఎంత మాత్రం సరిపోవడంలేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయమై గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు స్పందిస్తూ కార్మికుల సమస్యను పరిష్కరించి రెండు రోజుల్లోగా మిషన్ భగీరథ నీటిని అందిస్తామని తెలిపారు.


కొండాపూర్‌లో వేతనాలివ్వాలని నినదిస్తున్న మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులు

చలో రాజ్‌భవన్‌కు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



రాజ్‌భవన్ ఆందోళనలో సీఎం రేవంత్‌రెడ్డితో నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, డిసెంబరు, 18 (ఆంధ్రజ్యోతి) : అదానీ ఆర్థిక అవకతవకలపై వత్తాసు పలుకుతున్న కేంద్రంలోని బీజేపీ సారధ్య ఎన్‌డీఏ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన చలో రాజ్‌భవన్ ఆందోళనకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ నేతృత్వంలో భారీగా కార్యకర్తలు, నాయకులు నగరానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా చిట్కుల్‌లో వాహన శ్రేణిని మధు జెండా ఊపి ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొన్న చలో రాజ్‌భవన్‌లో నీలం మధుముదిరాజ్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వంటావార్పు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె 12వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా బుధవారం వంటావార్పుతో నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరం వద్ద భోజనాలు చేశారు. సమ్మెకు పటాన్‌చెరు, గుమ్మడిదల, సదాశివపేట ఎంఈవోలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ ప్రధాన కార్యదర్శి అనిల్ చారి, శేషాద్రి, లక్ష్మణ్, రమేశ్, భాస్కర్, లలిత, రాణి, రజిత పాల్గొన్నారు.


టీపీటీఎఫ్ మండల కార్యవర్గం ఏర్పాటు

హత్నూర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండల పరిధిలోని దేవునిగుట్టతండాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రాంచందర్‌ల పర్యవేక్షణలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నరేష్ (నస్తీపూర్), ప్రధాన కార్యదర్శిగా (సంగారెడ్డి) (పన్యాల) ఉపాధ్యక్షులుగా నర్సింగ్, లోకనాథం, జ్యోతి, కార్యదర్శులుగా గంగరాజు, ధర్మారావు, వెంకటేశం, ప్రసన్న, జిల్లా కౌన్సిలర్లుగా గణేష్, రజని, గణేష్, గౌసుద్దీన్, మల్లప్ప, నరేష్, మాధురి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రవీణ్, సభ్యులుగా వేణుగోపాల్, అకాడమిక్ సెల్ కన్వీనర్‌గా వాసవి, సభ్యులుగా శ్వేత, జీఓల కమిటీ కన్వీనర్‌గా సత్యనారాయణ, సభ్యులు ప్రేమలత, సోషల్ కమిటీ కన్వీనర్‌గా మంజుల, సంధ్యారాణి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

నారాయణఖేడ్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా 100వ జయంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్‌లో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వందమంది చికిత్స చేయించుకున్నారు. ఆపరేషన్లు అవసరమైన 26 మందిని హైదరాబాద్‌లోని శంకర్ నేత్రాలయానికి తరలించినట్లు జిల్లా సేవా సమితి కన్వీనర్ శంకరప్ప తెలిపారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 370 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు చేయించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి


మాట్లాడుతున్న సంగీతపాటిల్

రాయికోడ్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇంపాక్ట్ ట్రైనర్ పట్లోల సంగీత పాటిల్ కోరారు. బుధవారం జడ్పీహెచ్ఎస్, టీజీ సోషల్ వెల్ఫేర్, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు రాయికోడ్ మండలంలోని అల్లాపూర్ వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గురువులు చెప్పిన విషయాలను పాటించాలన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, జూనియార్ కాలేజీ ప్రిన్సిపాల్ దత్తురాణి, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

నారాయణఖేడ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండలం మావినెల్లికి చెందిన దత్తుసాగర్, శివకుమార్, సంగమేష్, శివకుమార్, చెన్నప్ప, శ్రీకాంత్, సుధాకర్, నాగ్‌శెట్టి, గణేష్‌పాటిల్, అంగత్‌రావు తదితరులు కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

గోరక్షణ పాదయాత్రకు స్వాగతం

మనోహరాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : గోమాతను కాపాడాలని బాలకృష్ణ అనే గురుస్వామి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోమాతతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర బుధవారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు చేరుకున్నది. కాళ్లకల్ జాతీయ రహదారి వద్ద సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్, గురుస్వామి, అయ్యప్ప భక్తులు స్వాగతం పలికారు. అలాగే శ్రీరామ పాదుక సమేత పాదయాత్ర అయోధ్యవరకు సాగుతుంది. ఈ యాత్రకు కాళ్లకల్ వద్ద అయ్యప్ప భక్తులు స్వాగతం పలికారు.